ప్రజాశక్తి
బుధవారం 8 అక్టోబర్ 2025



మహనీయులు మహర్షి వాల్మీకి

జిల్లా వ్యాప్తంగా ఘనంగా జయంతి వేడుకలు



పుట్టపర్తి కలెక్టరేట్లో వాల్మీకికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన గ్రంథాన్ని అందించిన మహనీయులు మహర్షి వాల్మీకి అని పలువురు కొనియాడారు. వాల్మీకి జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్లోని అబ్దుల్ కలాం షాదీమహల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వాల్మీకి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నివాళులు అర్పించారు. మానవుడు మారగలడు అనేదానికి వాల్మీకి మహర్షిని మించిన ఉదాహరణ మానవజాతి చరిత్రలో ఎక్కడ వెదికినా కనిపించదని వక్తలు కొనియాడారు. కూటమి ప్రభుత్వం వాల్మీకుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

ద(గు)బుల్ రిజిస్ట్రేషన్..!

- వెలుగులోకి మరో భూ మాయ
- డబుల్ రిజిస్ట్రేషన్‌తో భూమి కాజేసే కుట్ర
- రెవెన్యూ విచారణలోనూ తేలిన అక్రమాలు



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఇప్పుడు ఎక్కడ భూమి కనబడినా యజమానికి తెలియకుండానే చేతులు మారిపోతోంది. రిజిస్ట్రేషన్ స్థలాలనే ఇతరులకు డబుల్ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అనంతరం కొంత మంది వ్యక్తులు వచ్చి తమదే భూములని చెబుతుండటం పరిపాటిగా మారుతోంది. ఇటీవలనే అనంతపురం నగరంలోని సాయినగర్‌లో ఇటువంటి ఘటనే జరిగిన విషయం తెలిసిందే. తాజాగా అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలో ఇటువంటి ఘటనే వెలుగులోకి వచ్చింది. ఎప్పుడో 16 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన భూమిని 2025 జులైలో మరోకరు చేయించుకోవడం జరిగింది. అనంతరం ఆ స్థలంలో భూమి తమదంటూ బోర్డు కూడా పెట్టడంతో స్థల యజమానులు లబోదిబో మంటున్నారు. అధికారులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు తమకు జరిగిన నష్టాన్ని తెలియజేశారు. వారి దీనిని విచారించాలని ఆదేశాలు ఇవ్వడంతో రెవెన్యూ అధికారులు స్థలంలో సర్వేలు చేపట్టారు. దీనికి సంబంధించి పూర్వాపరాలు ఈ విధంగానున్నాయి.

అనంతపురం నగరంలోని ఎ.నారాయణపురం రెవెన్యూ పరిధిలోని 156 సర్వే నంబర్‌లో తొమ్మిది ఎకరాల పొలముంది. దీన్ని నారప్ప సబ్ డివిజన్ తరువాత వేరొకరికి అమ్మారు. నగేష్, కేశవయ్యల ద్వారా కవలూరు కృష్ణ అనే వ్యక్తి 2009లో ఒక ఎకరం కొనుగోలు చేశారు. అప్పటి నుంచి వారి ఆధీనంలోనే ఉంది. ఈ భూమిని 2009 జులై 25వ తేదీన ముకుందనాయుడు, పద్మగీత పేరు మీద జులై 25వ తేదీన మరో రిజిస్ట్రేషన్ అయ్యింది. రమణారావు అనే సబ్ రిజిస్ట్రార్ ఈ భూమిని మొదట పెండింగ్ పెట్టి తరువాత ఆగస్టు 6వ తేదీన రెగ్యులర్ చేసినట్టు ఆరోపణలున్నాయి.

మాకు న్యాయం చేయండి

అనసూయ, కవలూరు కృష్ణ.

2009లో మేము కొన్న భూమిలో ముకుందనాయుడు అనే వ్యక్తి ఆగస్టు 14వ తేదీన ఈ స్థలం తనదేనంటూ బోర్డు నాటారు. దీనిపై ఆగస్టు 18వ తేదీన కలెక్టరుతోపాటు, రిజిస్ట్రేషన్ అధికారులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేసాం. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఆ సర్వే రిపోర్టు అందజేసి, డబుల్ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని తాము అధికారులను వేడుకుంటున్నాం. 38 సంవత్సరాలు కష్టార్జితం ఆ భూమి అని, దానిని తమకు ఇచ్చి న్యాయం చేయాలి.

సర్వేలో కవలూరి కృష్ణదిగానే తేలింది

హరికుమార్, తహశీల్దార్, అనంతపురం అర్బన్.

ఎ.నారాయణపురంలోని 156 సర్వే నంబర్‌లో సర్వే నిర్వహించాం. మొత్తం తొమ్మిది ఎకరాలుంటే.. అందులోనున్న వారందరినీ పిలిచి సర్వే చేశాం. వెబ్ ల్యాండ్ ప్రకారం ఆ భూమి కవలూరిది కృష్ణదిగానే తమ రికార్డుల్లో ఉంది. ఈ నివేదికను సబ్ రిజిస్ట్రేషన్ శాఖకు ఎండార్స్ చేస్తాం. డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిఉంటే తదుపరి చర్యలు ఆ శాఖ అధికారులు తీసుకోవాల్సి ఉంటుంది.

రిపబ్లిక్ డే పరేడ్‌కు 'మంగళకర' విద్యార్థి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజు పల్లి మంగళకర విద్యార్థిని కె. ప్రణవ్ 2026 లో జరిగే పెరేడ్‌కు ఎంపికైనట్లు మంగళకర విద్యాసంస్థల చైర్మన్ సురేష్ కుమార్ తెలిపారు. ఇంటర్ కం బెటాలియన్ కాంపిటీషన్‌లోఉమ్మడి జిల్లా నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎంపికై, హైదరాబాదులో నిర్వహించే ఆర్ ఓ సి క్యాంపునకు వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా, మంగళకర ప్రిన్సిపాల్ బిందుజ, ఏఎన్‌ఓ మహమ్మద్ మన్సూర్ తదితరులు విద్యార్థిని అభినందించారు.



ప్రణవ్



నిరసన తెలుపుతున్న నాయకులు

పనిగంటల పెంపు బిల్లును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. పుట్టపర్తి గణేష్ సర్కిల్ నందు సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమల్లో 8 గంటల పనిని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించటం కార్మిక వర్గాన్ని నిలువ దోపిడీ చేయడమే అని అన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మికుల చట్టాలు రద్దుచేసి 4 లేబరు కోడ్‌లను ఆమోదించిందన్నారు. కోడ్‌లు అమలుచేయడంతో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం పనిగంటల పెంచి కార్మికుల శ్రమను యాజమాన్యాలు మరింత దోచుకోవడానికి అవకాశం కల్పించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసం చేయడమేనన్నారు. కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండా నేరుగా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టటాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సాకే వెంకటేష్, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రావణి, సరస్వతి, కళాకారుల సంఘం కార్యదర్శి నాగరాజు, పుట్టపర్తి మండల కన్వీనర్ పై పల్లి గంగాధర్, బుక్కపట్నం సిఐటియు కన్వీనర్ బ్యాల్ల అంజి, ఆఫీస్ కార్యదర్శి సిద్దు, రమాదేవి, బువ్వమ్మ, వెంకటేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

10న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న హిందూపురంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి బండ్ల హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్లో కలెక్టర్ తో కలిసి జాబ్ మేళా గోడ పత్రికలను మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15 బహుళ జాతీయ కంపెనీలు ఈ జాబ్ మేళలో పాల్గొనడం జరుగుతుందన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో 10వ తేదీ ఉదయం 9 గంటలకు ఎస్ డి జి ఎస్ ఎంబీఏ కాలేజ్ లో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెగా జాబ్ మేళాలో టెక్ మహేంద్ర, మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ, డాక్టర్ రెడ్డీస్, హుండాయ్ మోటార్స్, పేటీఎం, యంగ్ ఇండియా లాంటి 15 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఈ మెగా జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతీ యువకులు విద్యార్హతలు 10వ తరగతి, ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా, బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బి.టెక్, పిజి చదివి18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. ఈమెగా జాబ్ మేళా లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకి నెలకి రూ 10 వేల నుండి 25 వేల రూపాయల వరకు వేతనం ఉంటుందని తెలియజేశారు. హాజరు అయ్యే అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు ఫోటోలతో రావాలన్నారు. మరిన్ని వివరాలకు, 9676706976, 9959416770 ఫోన్ నంబర్స్ కు సంప్రదించాలని తెలిపారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా కొత్తచెరువు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.కశాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప పాల్గొని విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే మండల కేంద్రంలోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజు, మండల విద్యాశాఖ అధికారులు సోమశేఖర్ నాయుడు, జయచంద్ర, ప్రధానోపాధ్యాయులు గోపాల్, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ అపరిశుభ్రత కనపించలేదా..?



చేనేపల్లికి వెళ్లే రహదారి పై మురుగు నీరు



తుమ్మలకుంటలో అధ్వానంగా రహదారి

కార్యాలయం శుభ్రంగా ఉంచితే చాలదు,గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

సోషల్ మీడియా వేదికగా ప్రజల ఆగ్రహం!

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రభుత్వం "స్వచ్ఛ కార్యాలయం" అవార్డు ప్రకటించడంతో ప్రజల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. పంచాతీ పరిశుభ్రత లేకుండా ఇలాంటి బహుమతులు ఇవ్వడం సరైందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం లోపల శుభ్రం చేసినంత మాత్రాన సరిపోదని అంటున్నారు. సాధారణ ప్రజలతో పాటు ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, ప్రజాస్వామ్యవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు.కార్మికులకు 6 నెలల జీతాలు ఇవ్వనందుకు అవార్డు ఇచ్చారా అని ఒకరు మా ఊరిలో చెత్త తొలగించనందుకు అవార్డు ఇచ్చారా అని మరికొందరు విమర్శిస్తున్నారు.

పేరుకు పోయిన చెత్త

చిలమత్తూరు మేజర్ పంచాయతీ పరిధిలో మూడు సచివాలయాలు ఉన్నాయి. చిలమత్తూరు-1,2,3 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో వీధులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇక దళిత వాడల పరిస్థితి వర్ణాతీతం. మరవకొత్త పల్లి బీసి కాలనీ, ఎస్సీ కాలనీ, కొత్తచామల పల్లి, పాతచామల పల్లి ఎస్సీ కాలనీ, ఆదేపల్లి తండా, చిలమత్తూరు బీసీ కాలనీ, అప్పన్నపల్లి, చేనేపల్లి, తుమ్మల కుంటలో మురుగు కాలువలలో చెత్త చేరి రోడ్లపై నీరు ప్రవహిస్తున్నాయి. అలాగే రోడ్లపై చెత్త చదారం చేరి వాహన ప్రమాదాలకు దారితీస్తోంది. ఇక మురుగు చేరి దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. గ్రామం మొత్తం చెత్తతో నిండిపోయి ఉంది. అధికారి ఉండే కార్యాలయం మాత్రం పరిశుభ్రంగా ఉన్నందుకు అవార్డు ఇచ్చారని తాము మాత్రం చెత్త కుప్పలు, మురుగు గుంటల మధ్య జీవిస్తూ రోగాల బారిన పడాలని ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పక్కనే చికెన్ షాపులు.. కుక్కల బెడద

మండల కేంద్రంలో ప్రధాన రహదారుల ఇరువైపులా ఉన్న చికెన్ షాపుల నిర్వాహకులు చెత్తను రోడ్లపై పారేస్తుండటంతో కుక్కల బెడద తీవ్రమైంది. రాత్రివేళల్లో కుక్కలు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చికెన్ షాపులు మూసివేయించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు నీరు.. పందుల స్వైర విహారం : డ్రైనేజీ సిస్టమ్ సరిగా లేకపోవడంతో మురుగు నీరు వీధులలో నిల్వఉంటోంది. దీంతో ఆయా ప్రాంతాలు పందులకు ఆవాసంగా మారాయి. ప్రతిరోజూ చెత్త మధ్య, పందుల మధ్య జీవిస్తున్నాం. పరిశుభ్రత అవార్డు ఎక్కడి నుండి వచ్చిందో అర్థం కావడం లేదు" అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయం క్లీన్‌గా ఉంచుకోవడం మంచిదే కానీ, గ్రామం మొత్తం పరిశుభ్రంగా ఉండాలని అంటున్నారు. 'ఫోటోలు తీసుకుని అవార్డులు తెచ్చుకోవడం కంటే ఆచరణ ముఖ్యం.. ప్రజల జీవన వాతావరణంలో నిజమైన పరిశుభ్రత కనపడాలి." వాస్తవ పరిస్థితుల ఆధారంగా అవార్డులు ఇవ్వాలి అని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. పరిశుభ్రంగా ఉన్న పంచాయతీలకే అవార్డులు ఇవ్వాలని అలా చేస్తేనే అవార్డుల విలువ పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

గృహ నిర్మాణ ప్రగతిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

కలెక్టర్ శ్యాంప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

గృహ నిర్మాణ ప్రగతిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని గృహ నిర్మాణ లక్ష్యాలను వందశాతం సాధించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో నిర్మాణ పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు లక్ష్య సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో గృహ నిర్మాణ వివరాలు సేకరించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి సోమవారం సాయంత్రం గృహ నిర్మాణ సంస్థపై సమీక్ష జరుపుతూ పురోగతిని పర్యవేక్షించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను వెంటనే నివేదించాలన్నారు. కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం చూపితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలాల వారీగా ఇంటి స్థలం లేనివారు, స్థలం ఉండి ఇల్లు మంజూరు అయిన వారు, ఇల్లు మంజూరు అయినా కట్టని వారి జాబితాలు వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. రామగిరి, కదిరి అర్బన్, గోరంట్ల, ధర్మవరం అర్బన్, పెనుగొండ, సోమందేపల్లి, కనగానపల్లి మండలాల్లో జీరో పురోగతి ఉన్నందున వచ్చే వారంలోగా గణనీయమైన ఫలితాలు చూపాలన్నారు. అదనపు నిధులు పొందిన లబ్ధిదారులు ఎస్సీ, బిసి లకు 50 వేల రూపాయలు, ఎస్టీలకు 75 వేల రూపాయలు వర్తిస్తుందని ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తయిన ప్రతి ఇంటికి మరుగుదొడ్ల నిర్మాణం తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకటనారాయణ, ధర్మవరం డివిజన్ ఇంజనీరు లక్ష్మీనారాయణమ్మ, పుట్టపర్తి, రాప్తాడు, పెనుగొండ, ధర్మవరం ఉపకార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీనివాస్, శంకర్ లాల్, శివకుమార్, వెంకటేశ్వర్లు, సహాయక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుతో ఉపశమనం

ప్రజాశక్తి-పెనుకొండ

జీఎస్టీ రేట్ల తగ్గింపు సామాన్యుడికి ఉపశమనం అని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. జయప్ప అన్నారు. జిఎస్టి 2.0 పై కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ 2.0 భారతదేశంలో పన్నుల విధానాన్ని సరళీకృతం చేయడం అన్నారు. సామాన్య ప్రజలపై పన్ను భారాన్ని తగ్గించి వ్యాపారాలకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కార్యకలాపాలను సులభతరం చేయడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి వి నారాయణ జీఎస్టీ చారిత్రిక నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. సరళీకరణ పన్ను వర్గీకరణలో ఉండే గందరగోళాన్ని తగ్గిస్తుందని వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు ఎస్ చంద్రమోహన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, ప్రతాప్, రామన్న, సంజీవరెడ్డి, కాంతారావు, నగేష్ గౌడ్, ఖాలీదా జియా, మమత, లలిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు అన్ని రకాల ఉపయోగాలు పొందవచ్చునని ఎంపీడీవో నరసింహనాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో జీఎస్టీ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహనాయుడు, డిప్యూటీ ఎంపిడిఒ కిష్టప్ప, పంచాయతీ కార్య దర్శులు, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : మండల పరిధిలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన వారికి సమాజ సేవకులు మల్లెలరమేష్ ,పాఠశాలప్రధానోపాధ్యాయురాలు పి విజయమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అ ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలకు కుర్చీలు వితరణ : మండలంలోని ప్రభుత్వ ఆరోగ్య వైద్యశాలకు గౌనిపల్లి గ్రామానికి చెందిన సమాజ సేవకులు మల్లెల రమేష్ 4 వేల రూపాయలువిలువ గల 10 కుర్చీలు ఆరోగ్య సిబ్బందికి మంగళవారం అందించారు.

20 మంది హోంగార్డులు బదిలీ

ప్రజాశక్తి - మడకశిర టౌన్

చాలాకాలంగా తిష్ట వేసిన హోంగార్డులపై అనేక ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఎస్పీ సతీష్ కుమార్ ప్రక్షాళన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పెనుగొండ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 49 మంది హోంగార్డులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 2014 నుండి నేటి వరకు 12 సంవత్సరాలు ఒకే స్టేషన్లో పనిచేస్తున్న హోంగార్డులను బదిలీ చేశారు. 12 సంవత్సరాలు ఒకే స్టేషన్లో పనిచేసిన వారు ఒక్కరు ఉంటే 11 సంవత్సరాల పాటు ముగ్గురు, 10 సంవత్సరాల పాటు ఇద్దరు, ఆరు సంవత్సరాల పాటు ఐదుగురు, ఏడు సంవత్సరాల పాటు ఇద్దరు హోంగార్డులు ఉన్నారు. తాజాగా మడకశిర సర్కిల్ పరిధిలోని మడకశిర పోలీస్ స్టేషన్ నుండి 15 మందిని బదిలీ చేయగా ఆగలి, అమరాపురం, గుడిబండ మండలాలనుంచి ఒకరు చొప్పున ,రొల్ల మండలంలో ఇద్దరు చొప్పున మొత్తం మడకశిర సర్కిల్లో 20 మందిని బదిలీ చేశారు.

ఆకట్టుకున్న నైపుణ్య ప్రదర్శనలు

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయులు బోధనలో కాలానుగుణంగా నైపుణ్యాలను ప్రదర్శించాల్సిన అవసరం ఎంతో ముఖ్యమని యస్‌సిఇఆర్‌టి రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వరులు పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా హిందూపురం సమీపం లోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 2025 డియస్సి లో ఎంపికయిన నూతన ఉపాధ్యాయులకు శిక్షణ తరగుతులను ఆయన తో పాటు భారత్ విద్యా సంస్థ వ్యవస్థపకులు రమణారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా నూతన ఉపాధ్యాయులు ప్రదర్శించిన వివిధ నైపుణ్య ప్రదర్శనలు చాలా బాగున్నాయని వారు అభినందించారు. ఇలాగే విధుల్లోకి చేరిన తరువాత బోధనతో పాటు విద్యార్థుల్లో కూడా నైపుణ్య ప్రదర్శనల ద్వారా విషయ పరిజ్ఞాం పై అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, శేషాచలం, ప్రసన్న లక్ష్మి, భారత్ విద్యా సంస్థ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస రెడ్డి, ఈశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలి : సిఐటియు


ఆశాలతో మాట్లాడుతున్న ఇ.ఎస్ వెంకటేష్


లేపాక్షిలో వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఆశావర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేశులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆశాకార్యకర్తలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని వైద్యాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రెండు నెలల నుంచి ఉన్న పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. గత 18సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న 'ఆశా'ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి అనూష, త్రివేణి, ఉమాదేవి, రామాంజనమ్మ, చంద్రకళ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లేపాక్షి : ఆశా కార్యకర్తలకు పనిభారం తగ్గించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్ తో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఎంపిహెచ్ఒకు మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు పనికి తగిన వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాధమ్మ, సద్క, సత్యవతి, మండలంలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తనకల్లు : ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో మండల వైద్యశాఖ అధికారికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల వేతనాలను పెంచాలని, పని భారం తగ్గించాలని, ఆశా వర్కర్లకు అన్ని రకాల సెలవులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒంటెద్దు వేమన్న, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు

కదిరి టౌన్ : ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని పని భారం తగ్గించాలని సిఐటియూ గౌరవ అధ్యక్షుడు సాంబశివ డిమాండ్ చేశారు. ఆశాడే సందర్భంగా మెడికల్ ఆఫీసర్కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు అంజినమ్మ, గంగులమ్మ, రమాదేవి, నాగలక్ష్మి, రమణమ్మ, గాయత్రి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హిందూపురం : ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆశాలు వైద్యాధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. హిందూపురం బోయపేట పి.హెచ్.సి లో రమేష్ బాబుకు ఆశా వర్కర్లు వినతిపత్రం సమర్పించారు. వీరికి మద్దతుగా హిందూపురం సిఐటియు పట్టణ కన్వీనర్ వినోద్ రాము పాల్గొని మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు జానకి, శివమ్మ, ఆయిషా, సుకన్య, నాగజ్యోతి, సుశీలమ్మ, అశ్వత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు..

ప్రజాశక్తి - బత్తలపల్లి

కుటుంబ గొడవల కారణంగా పుట్టింటికి వచ్చిన మహిళ తిరిగి అత్తారింటికి వెళ్లడం ఇష్టం లేక తన ఇద్దరు కూతుర్లతో కలిసి కనిపించకుండా పోయిందని ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని కోటి కాలనీలో నివాసం ఉంటున్న గోగుల అరుణ, గోగుల శ్రీనివాసులు పెద్ద కూతురు భాగ్యలక్ష్మిని పుట్టపర్తి టౌన్ కు చెందిన కృపాకర్ కు ఇచ్చి వివాహం చేయగా, వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు. అయితే భార్య, భర్త ల మధ్య గొడవల వల్ల పుట్టిల్లుకు ఒక నెల క్రితం తన ఇద్దరు కుమార్తెలతో కలసి వచ్చింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి తిరిగి అత్తవారి ఇంటికి పంపేందుకు ప్రయత్నం చేస్తుండగా తాను అక్కడికి వెళ్లి కాపురం చేయడం ఇష్టం లేదని అంటుండేది. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం సమయం తన కూతుర్లు ఆరు సంవత్సరాల జాష్ణవి, మూడు సంవత్సరాల యశశ్విని పిలుచుకుని ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్ళిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతికినప్పటికి ఫలితం లేకపోవటంతో భాగ్యలక్ష్మి తల్లి గోగుల అరుణ మంగళవారం ఫిర్యాదు చేసిందని దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

తనపై వ్యక్తిగత దూషణలకు దిగిన ఎస్ఐపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు విద్యార్థి సంఘం నాయకుడు ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు ఉపేంద్ర మాట్లాడుతూ గతంలో ఎన్నడు ఏ పోలీస్ అధికారి వ్యవహరించని విధంగా గత కొన్ని రోజులుగా ఎస్సై బాబ్జాన్ తనపై మీద కక్ష కట్టి కులం పేరుతో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎస్ఐ బాబ్జాన్‌పై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పరికరాలు అందజేస్తున్న దృశ్యం

అగ్నిమాపక కేంద్రానికి భద్రతా పరికరాలు

ప్రజాశక్తి- హిందూపురం

సామాజిక బాధ్యతలో భాగంగా హిందూపురం రూరల్ మండల పరిధిలోని గోళ్లాపురంలో ఉన్న పీ.కే. స్టీల్ కాస్టింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మంగళవారం హిందూపురం అగ్నిమాపక శాఖకు వివిధ రకాల అగ్ని భద్రతా పరికరాలను వితరణగా అందజేసింది. హిందూపురం అగ్నిమాపక అధికారి ప్రభాకర్ అభ్యర్థన మేరకు ఈ పరికరాలు అందచేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీ.కే. స్టీల్ కాస్టింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అడ్మిన్ మేనేజర్ అలీ, సేఫ్టీ మేనేజర్ షేక్ చాంద్ బాషా, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు

ప్రజాశక్తి - గోరంట్ల

73వ జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు లో భాగంగా గోరంట్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అటవీశాఖ అధికారులు చంద్ర నాయక్, రామకృష్ణ, చిన్నప్పయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వన్య ప్రాణుల ప్రాముఖ్యత, మనుగడ, వాటి సంరక్షణ గురించి వివరించారు. అనంతరం సూపర్ జీఎస్టీ అబ్జర్వర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి ఈశ్వర్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోరి వికాసం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. కిశోరి బాలికలు మంచి పౌష్టికహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయురాలు రాధ, అంగన్వాడీ కార్యకర్తలు శంషాద్, సుజాత, శశికళ విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని నారనాగేపల్లికి చెందిన ముత్యాలప్ప (60)మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగభూషణ, మనోహర్, లింగప్ప, సోమశేఖర్, ధనుంజయ్ గౌడ్, నాగిరెడ్డి, గోవిందు, లోకేష్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మండలమీట్

అధికారుల వాగ్వాదం
తహశీల్దార్ తీరుపై పంచాయతీ కార్యదర్శి అసహనం
అధికారుల వైఖరిపై ఎంపిపి ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశం వేదిక అధికారుల మధ్య వాగ్వాదాలతో రచ్చకెక్కింది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల మీట్‌లో చిలమత్తూరు పంచాయతీ కార్యదర్శి సావిత్రి, ఆర్ఐ నేలకోటప్పల మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. చిలమత్తూరు మేజర్ పంచాయితీలో అపరిశుభ్రతతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, మురుగు, చెత్త చెదారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి సమావేశంలో సమస్యను లేవనెత్తారు. దీంతో ఎంపీపీ స్పందించి కార్యదర్శి సమాధానం చెప్పాలని కోరారు. తమకు ఎస్‌డబ్ల్యూపీసీ లేదని స్థలం కావాలని తహశీల్దార్‌కు లెటర్ కూడా పెట్టామని ఆయన స్పందించలేదని అన్నారు. ఎన్నిసార్లు వెళ్లినా ఆయన అందుబాటులో లేరని, అస్సలు ఆయన కార్యాలయానికే రారని కార్యదర్శి వాఖ్యానించడంతో వివాదం చెలరేగింది. ఆర్ఐ నేలకోటప్ప కలుగజేసుకొని స్థలం కావాలంటే పంచాయతీ స్థలం వినియోగించుకుంటే సరిపోతుందని చెప్పారు. చెత్తను తీసివేయాల్సిన బాధ్యతను మరచి సోషియల్ మీడియా వేదికగా తమపై అభాండాలు వేయడం విడ్డూరంగా ఉందని కౌంటరు ఇచ్చారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న చెత్త అంతా వాళ్లే వేశారని కార్యదర్శి ఆరోపించారు. ఇద్దరు అధికారుల మధ్య వాగ్వాదం పెరగడంతో ఎంపీపీ కలుగజేసుకొన్నారు. ఇది సర్వసభ్య సమావేశంలా లేదని బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు ఇలా వాదులాడుకోవడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. కార్యదర్శి సావిత్రి తీరుపై ఆయన మండిపడ్డారు. పారిశుధ్య సమస్యలు కంటికి కనిపిస్తున్నాయని, ఎందుకు చెత్త తీయడం లేదని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించమంటే నిధులు లేవని పొంతనలేని సమాధానం ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అదే విషయాన్ని ఎంపీడీవో రమణమూర్తి ను ప్రశ్నించగా తాను చెప్పినా కార్యదర్శులు వినడం లేదని ఆయన వ్యాఖ్యానించడంతో సభ్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పంట దిగుబడి అసలు లేదని, కోత దశకు వచ్చినా ఇంకా ఈక్రాప్ బుకింగ్ చేయలేదని ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. సమస్య పరిష్కరిస్తామని వ్యవసాయాధికారిణి కవితారాణి తెలిపారు. చిలమత్తూరు పంచాయితీలోరూ. 86 లక్షల నిధుల దోపిడీపై వైసిపి ఎంపీటీసీలు ప్రశ్నించారు. అధికారిపై చర్యలు తీసుకున్నారే కానీ నిధులు ఎవరు కాజేశారు. నిధుల రికవరీపై నోరుమెదపకుండా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. కార్యదర్శి స్పందిస్తూ తాను ఉన్నప్పుడు జరగలేదని, పైగా దానిపై విచారణ జరుగుతోందని అన్నారు. అధికారులు సమస్యలకు పరిష్కారం చూపకుండా, ప్రశించిన వారిపై తిరిగి ప్రశ్నలు వేయడం మంచి పద్దతి కాదని ఎంపీపీ ఆగ్రహం వ్యక్తంచేశారు. దేమకేతేపల్లి సర్పంచి తిరుమలేష్, పలగలపల్లి సర్పంచి శంకరరెడ్డి మాట్లాడుతూ పిఆర్ జెఇ వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవటంతో ఇప్పటి వరకూ నూతన భవనాలు పంచాయతీలకు అప్పజెప్పలేదని అన్నారు. సమస్యను ఇంజనీరుకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని విమర్శించారు. ఎంపీపీ కలుగజేసుకొని బిల్లులు ఎందుకు ఆలస్య చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో పై నుండి రావాలని తమ చేతుల్లో ఏమీ లేదని ఇంజనీర్ జమాల్ భాషా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచులు సంధ్య, తిరుమలేష్, శంకర్రెడ్డి, నీలిభాయి, ఎంపీటీసీలు మంజునాథ్, టీ. కవిత, కవిత, ఆదినారాయణ, సనమ్ హుస్నా, రాఘవేందర్ రెడ్డితో పాటు సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు క్రిష్ణమూర్తి కోరారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోనేరు వద్ద వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి రథోత్సవం ప్రారంభించారు. ఈసందర్భంగా బంగారు కృష్ణమూర్తి మాట్లాడుతూ వాల్మీకులు ఎంతో కాలంగా తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని పోరాడుతున్నారన్నారు. ఈ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.


బంగారు క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో రథయాత్ర

సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు తెలంగాణ ముఖ్యమంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలో నిర్వహించే శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈమేరకు ఆయన మంగళవారం తెలంగాణ సిఎంను కలిసి శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన ఆహ్వానించారు.


తెలంగాణ ముఖ్యమంత్రితో ఆర్‌జె. రత్నాకర్

మద్యం అక్రమ రవాణాపై నిరంతర నిఘా

ప్రజాశక్తి - కదిరి టౌన్

మద్యం అక్రమ సరఫరా, నకిలీ మద్యం పై నిరంతర నిఘా ఉంచాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రొహిబిషన్ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ,అనంతపురం ఎన్ఫోర్స్మెంట్ ఎం శ్రీరామ్ తనిఖీ చేశారు. అనంతరం కదిరి ఎక్సైజ్, తనకల్లు ఎక్సైజ్ సిఐలతో ఇటీవలి నేరాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ అరెస్టులపై దష్టి సారించి అరెస్టులు పూర్తి చేయాలన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి వినతి


ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని గొల్ల, యాదవ కులస్తుల సౌకర్యార్థం కమ్యూనిటీ భవనం, కళ్యాణమండపం నిర్మించాలని శ్రీ వేణు మాధవ యాదవ వెల్ఫేర్ సంఘం నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2008 సంవత్సరం నుండి అనేకమార్లు ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించామన్నారు. 2017 సంవత్సరంలో 59 సెంట్లు స్థలాన్ని శ్రీ వేణు మాధవ యాదవ వేల్ఫార్ సొసైటీ సంఘానికి కేటాయించారన్నారు. ఆస్థలంలో ఆలయం, కమ్యూనిటీ భవనం, కళ్యాణమండపం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలోశ్రీ వేణు మాధవ యాదవ వెల్ఫేర్ సంఘం మండల అధ్యక్షులు జి మహేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గోపాల్ యాదవ్, కోశాధికారి ఏజీ నర్సింహమూర్తి , హరికృష్ణ యాదవ్, జిపి నరసింహులు యాదవ్, మాజీ ఉపాధ్యక్షులు ముత్యాల యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తచెరువు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కూటమి పార్టీల ఐక్యతతోనే రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన కొత్తచెరువు మార్కెట్ యార్డ్ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఉమ్మడి జిల్లాల జనసేన అధ్యక్షులు అహుడా చైర్మన్ వరుణ్, బిజెపి జిల్లా అధ్యక్షులు శేఖర్, నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ పత్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు.కొత్తచెరువు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా జనసేనకు చెందిన పూల శివప్రసాద్, వైస్ చైర్మన్ గా టిడిపికి చెందిన సోమగుట్ట ప్రేమ్ నాథ్ రెడ్డితో పాటు 13 మంది డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ కూటమిపాలనతోనే రాష్ట్రంలో సూపర్ పాలన సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ హరికృష్ణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా విద్యాభ్యాసం సాగాలి

హిందూపురం : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. మంగళవారం పట్టణంలోని రినౌల్డ్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్, మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, మంచి నిర్ణయాలు తీసుకుని భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, ర్యాంప్ వాక్ ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాది సంతోషి కుమారి, పాఠశాల నిర్వాహకులు ముస్తఫా అలీ ఖాన్, బీబీ హజీరా, సర్ఫరాజ్ అలీ ఖాన్, నాజినిన్, సాకీబ్ అలీఖాన్, నాజీమా, సల్మాన్ అలీ ఖాన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి హిందూపురం

పట్టణ సమీపంలోని లేపాక్షి మండలం నాగిపల్లి వద్ద ఉన్న పీర్ భక్తర్ వలి ఉరుసు ఉత్సవాలను కుల మతాలకు అతీతంగా అ ఐక్యంగా జరుపుకోవడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డి.ఎస్.పి కెవి మహేష్ పేర్కొన్నారు. మూడు రోజులుగా ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి ముగింపు కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్, డీఎస్పి హాజరయ్యారు. పీర్ భక్తర్ వలి దర్గా కమిటీ అధ్యక్షులు మక్తియర్ ఖాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, గత 23 సంవత్సరాలుగా కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి ఉరుసు ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ తరపున దర్గా కమిటీ సభ్యులందరినీ డి.ఎస్.పి మహేష్, సిఐలు అబ్దుల్ కరీం, జనార్ధన్ ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందించారు. అదేవిధంగా పెనుగొండ బాబాయి స్వామి వంశీకులు అయినా సయ్యద్ అబ్దుల్ రహమాన్ సాబ్ గురువుగారిని అందరూ కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం దర్గా కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమానికి పాల్గొన్న ముఖ్య అతిథులకు, కార్యక్రమం విజయవంతానికి సహాయ సహకారాలు అందించిన వారందరికీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం టూంకూరు కు చెందిన అర్షియ నాజ్, బెంగళూరుకు చెందిన షాబాజ్ దరాజ్ వారిచే ఏర్పాటు చేసిన ఖవ్వాలి కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ ఉపాధ్యక్షులు వెంకటరమణప్ప, సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, మొహమ్మద్ షరీఫ్, సమీవుల్లా, బాబాజాన్, క్రిష్టప్ప, నరసింహప్ప, ఆయిలే సున్నతుల్ జమాత్ అధ్యక్షులు మహబూబ్ దౌలా, డాక్టర్ వారీస్, షబ్బీర్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.


ఉరుసు సందర్భంగా నిర్వహిస్తున్న ఖవాలి

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహిళ పిఎస్ డిఎస్పి ఆదినారాయణ పర్యవేక్షణలో మహిళలకు, బాలికలు పాఠశాల, కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్, సైబర్ నేరాలు ,డ్రగ్స్ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్ లపై చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో శక్తి టీం బృందాలు పలు పాఠశాలల్లో విద్యార్థులకు శక్తి యాప్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పేరుమార్పు / సవరణ

నేను జులకాల గంగారత్న W/o (Late) జులకాల ఓబులాపతి, నివాసం : డోర్ నెం. 2-200, సానేవారిపల్లి, ముదిగుబ్బ, శ్రీ సత్యసాయిజిల్లా.
ప్రస్తుతం నా కుమారుడి యొక్క ఆధార్ కార్డులో పేరు **జులాకుల శరన్** అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు 10వ తరగతి మార్కుల జాబితా ప్రకారం పేరు సవరణ చేయగా **జులకల చరణ్‌తేజ్ S/o జులకల ఓబులాపతి (Julakala Charan Thej S/o Julakala Obulapathi)** గా మార్పు చేయుట జరిగినది. నేటి నుండి నా కుమారుడి పేరును **జులకల చరణ్‌తేజ్** గా పిలువబడును. (ఆధార్‌లో మార్పు కొరకు)

సుప్రీంకోర్టు సిజెఐపై దాడి అమానుషం : సిపిఎం


హిందూపురంలో న్యాయవాదుల నిరసన



పెనుకొండలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి రాజ్యాంగంపై దాడి అని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశంలోనే రాజ్యాంగాన్ని నిలబెడుతూ పనిచేస్తున్న ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మున్ముందు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

హిందూపురం : భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పై దాడిని హిందూపురం న్యాయవాదుల సంఘం తీవ్రంగా ఖండించింది. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వన్నేరువప్ప, రామచంద్రప్పల ఆధ్వర్యంలో మంగళవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగరాజు రెడ్డి, రఘునాథ్ రెడ్డి, నాగప్ప, రామిరెడ్డి, హిదయతుల్లా ఖాన్, గోపాలకృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: సుప్రీంకోర్టు సిజెఐపై దాడి అమానుషమని కెవిపిఎస్ నాయకులు అన్నారు. సిజెఐ పై దాడి కి నిరసనగా పెనుకొండ ఆర్డీవో కార్యాలయం ముందు కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ న్యాయస్థానంలో పనిచేస్తూ కోట్లాది రూపాయలు గడించి తెగ బలిసిన ఖండకావరంతో బిజెపి ఆర్ఎస్ఎస్ విహెచ్పి లాంటి సంఘాల అండతో పెట్రేగి పోతున్నారన్నారు. ప్రధాన న్యాయమూర్తి పై బూటు విసిరిన కిషోర్ పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి జీవితాంతం జైల్లో పెట్టాలని దేశద్రోహిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మహిళా అధ్యక్షురాలు సరస్వతి, ప్రధాన కార్యదర్శి జ్యోతి, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, రత్నమ్మ, మహిళా సంఘం నాయకులు అంజలి, సునీత, రెడ్డమ్మ, శివమ్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పై దాడి చేయడాన్ని ప్రజా ఐక్య సంఘాల వేదిక నాయకులు ఖండించారు. దాడిని నిరసిస్తూ మంగళవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ లో ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థ గౌరవాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యుటియుసి రాష్ట్ర కన్వీనర్ ఏ.శ్రీనివాసులు, ఎం.ఎస్.ఎఫ్.జిల్లా అధ్యక్షులు రవికుమార్, దళిత సమైక్య జిల్లా అధ్యక్షులు ఎస్.నారాయణ, జై భారత్ భీమ్ రావ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగరాజ్, ఏపీ ఆర్.ఎస్.పార్టీ నాయకులు కోడుమూరు నౌషాద్, ఆర్.వై. ఎఫ్. జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నరసింహమూర్తి, పట్టణ అభివృద్ధి సంక్షేమ సంఘం నరసింహమూర్తి, కిరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ :సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై రాజేష్ కిషోర్ అనే న్యాయవాది దాడి చేయడం హేయమైన చర్య అని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ అన్నారు. సిజెఐ పై దాడికి నిరసనగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో రోడ్డు పై బైటాయించి నిరసన చేపట్టారు. ప్ల కార్డులు చేతపట్టుకుని రాజేష్ కిషోర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సనాతన ధర్మం చెప్పిన సూక్తులు ఇవేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రధాన న్యాయమూర్తి గవాయి తీర్పును ప్రకటిస్తున్నప్పుడు దాన్ని జీర్ణించుకోలేక రాజేష్ కిషోర్ ఆయనపై దాడి చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. సనాతన ధర్మాన్ని పాటించే రాజేష్ కిషోర్ పై చర్యలు తీసుకోవాలని అతని లా సర్టిఫికెట్ క్యాన్సిల్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాజా ద్రోహం కేసు నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షులు బాబు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, గౌరవ సలహాదారుడు, దేవీఎంపీ మెంబర్ రామాంజినప్ప, ఎంఆర్‌పిఎస్ రామాంజినేయులు, ఉపాధ్యకులు సురేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : సిజెఐపై దాడి అమానుషమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహులు, కదిరి సిఐటియు పట్టణ కార్యదర్శి బాబ్జాన్ అన్నారు. ఈసందర్భంగా మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిజెఐపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఆటో పెద్దన్న. ఆవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్, సిఐటియు కో కన్వీనర్ టైలర్ ముస్తఫా, ఆవాజ్ కమిటీ నాయకులు రహీం, నౌషాద్, అల్లా బకాష్, పకీరప్ప, హైదర్ వలీ, బాబా ఫక్రుద్దీన్, చికెన్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.